క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

మహాముత్తారం: మండల పరిధిలోని దొబ్బలపాడు ప్రభుత్వ తెలంగాణ స్టేట్ మోడల్ జూనియర్ కాలేజీలో ఇంటర్‌మీడియట్ మొదటి సంవత్సరానికి సంబంధించి ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూప్‌ల్లో సీట్ల భర్తీ కోసం దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ రాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు నేరుగా కళాశాలలో సంప్రదించాలని కోరారు.

వైద్య పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలి

మొగుళ్లపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మహిళా ఆరోగ్య పథకంలో భాగంగా నేడు(సోమవారం) మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించే 8 రకాల వైద్య పరీక్షలను మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారిణి డాక్టర్ పొరండ్ల నాగరాణి ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. మహిళా ఆరోగ్య పథకంలో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆశ్రమ పాఠశాల నుంచి పారిపోయిన విద్యార్థినులు

మహదేవపూర్: మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల నుంచి ఆదివారం తెల్లవారు జామున ఇద్దరు విద్యార్థినులు పారిపోయారు. కాగా, వెంటనే అప్రమత్తమైన హాస్టల్ సిబ్బంది గ్రామంలో వెతుకగా చౌరస్తాలో ఒకరు, గ్రామ చివరిలో ఇంకొకరు దొరికారు. వారిని వెంటనే ఆశ్రమ పాఠశాలకు తరలించారు. విద్యార్థినులు ఎందుకు పారిపోయారో వివరాలు తెలుసుకునేందుకు హాస్టల్ ఇన్‌చార్జ్ మ్యాట్రిన్ శైలజను ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి


మల్హర్: చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందినట్లు ఆదివారం పోలీసులు తెలిపారు. కొయ్యూరు ఏఎస్సై కుమారస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దతూండ్ల గ్రామానికి చెందిన రాంప్రసాద్(24) ఆగస్టు 21న గడ్డి మందు తాగాడు. దీంతో కుటుంబ సభ్యులు భూపాలపల్లి ప్రధాన ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సలహ మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం ఈనెల 2న హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. తిరిగి అతడిని ఈనెల 4న భూపాలపల్లి ప్రధాన ఆస్పత్రికి తీసుకువచ్చి చికిత్స చేయిస్తున్నారు. ఈ క్రమంలో మృతి చెందినట్లు ఏఎస్సై తెలిపారు. మృతుడి బావ రాధకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

బియ్యం అందజేత



ములుగు రూరల్: మండలంలోని మహ్మద్ గౌస్‌పల్లి గ్రామానికి చెందిన తిక్క బన్ని ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని ఎంపీపీ గంద్రకోట శ్రీదేవి సుధీర్‌యాదవ్ ఆదివారం పరామర్శించి 50 కేజీల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు యువరాజు, ఎంపీటీసీ జన్నారపు శ్రీను, రవి, కార్తీక్, రమేష్, అశోక్, యుగేంధర్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాజేడు: మండల పరిధిలో జగన్నాథపురం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై వాజేడు ఎస్సై ఇమాన్యూయెల్, చంద్రుపట్ల క్రాస్ వద్ద జాతీయ రహదారిపై వద్ద పేరూరు ఎస్సై రమేష్ ఆదివారం సివిల్, సీఆర్పీ ఎఫ్ పోలీసులతో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించారు. రహదారిపై వచ్చి వెళ్లే ప్రతీ వాహనాన్ని తనిఖీ చేసి అందులోని లగేజీని పరిశీలించారు. ప్రయాణికుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఆర్థిక సాయం

కన్నాయిగూడెం: మండలంలోని బుట్టాయిగూడెం గ్రామానికి చెందిన సునార్కాని ఆనందరావు జ్వరంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి ముప్పనపల్లి సహాయనిధి సభ్యులు అండగా నిలిచారు. ఈ మేరకు ఆదివారం రూ. 50 వేలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో పెద్ద దిక్కును కోల్పోయి నిస్సాహయ స్థితిలో ఉన్న కుటుంబానికి చేయూతనందించేందుకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు రావాలని అన్నారు. కన్నాయిగూడెం సర్పంచ్ అల్లెం ప్రభాకర్, కమిటీ సభ్యుడు సతీష్, సత్యనారాయణ, రమేష్, సంజీవ, అంజయ్య, విజయ్, మధు, రాజేష్, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారి



దిగబడిన లారీ



నిలిచిన వాహనాలు

- దిగబడిన లారీ–నిలిచిన వాహనాలు
- ఇబ్బందుల్లో వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

చిట్యాల: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ కల్వర్టు సమీపంలో రోడ్డు అధ్వానంగా ఉంది. దీంతో ఆదివారం రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న లారీ దిగబడడంతో పరకాల నుంచి చిట్యాలకు వచ్చే వాహనాలు నిలిచిపోయాయి. నెల రోజుల క్రితం కురిసిన భారీ వర్షాల మూలంగా మండలంలోని పలు గ్రామాలకు చెందిన తారు రోడ్లు అన్ని కొట్టుకపోయాయి. దీంతో తాత్కలికంగా మట్టి రోడ్డు పోశారు. మళ్లీ గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పోసిన మట్టి రోడ్డుపై ఇసుక లారీలు నడవడంతో రోడ్డు మొత్తం గుంతలమయంగా మారింది. దీంతో ఇతర వాహనాలు ఎక్కడిక్కడే నిలిచిపోతున్నాయి. ఇంత జరుగుతన్నా కనీసం సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం ఏంటని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దిగబడిన లారీని ఎవరూ తీయ్యక పోవడంతో నాలుగు గంటలు పలు రకాల వాహనదారులు అక్కడే ఉండి అనేక ఇబ్బందులు పడ్డారు. కొంత మంది ప్రయాణికులు పరకాల నుంచి బస్సులో వచ్చి కిలోమీటరున్నర దూరం నడిచి చిట్యాలకు చేరుకున్నారు. అలాగే పరకాలకు వెళ్లే వారు మోడల్ స్కూల్ వద్దకు వచ్చారు. ఇక్కడికి వచ్చిన బస్సులు మళ్లీ వెనుదిరిగి పరకాలకు వెళ్లాయి. కనీసం సంబందిత అధికారులకు సమాచారం అందించిన ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రయణికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబందిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు సక్రమంగా చేయాలని కోరారు. కాగా. సంబంధిత అధికారుల సమాచారం మేరకు స్థానిక సర్పంచ్ దిగబడిన లారిని తీసి రోడ్డుకు తాత్కలిక మరమ్మతులు చేశారు. దీంతో యథావిధిగా బస్సులు, చిన్న చిన్న వాహనాలు మాత్రమే వెళ్లాయి. ఒక వేళ ఈ దారిలో ఇసుక లారీలు వెళ్లితే మళ్లీ దిగబడే ప్రమాదం ఉంది.

ప్రతిపాదనలు పంపించాం..

ఇటీవల కురిసిన వర్షాలకు కొన్ని చోట్ల రోడ్లు మొత్తం కోట్టుకపోయాయి. దీంతో పదిహేను రోజుల క్రితం ప్రభుత్వానికి ఒక నివేదిక రూపంలో ప్రతిపాదనలు పంపించాం.

– రమేష్, డీఈ

దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతు



చిట్యాల: మొరం పోయిస్తున్న ఎస్సై శాఖాన్



మొగుళ్లపల్లిలో..

మొగుళ్లపల్లి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక ఎస్సై జాడి శ్రీధర్ ఆధ్వర్యంలో మరమ్మతులు చేయించారు. మండలంలోని బంగ్లాపల్లి రోడ్డు, పెట్రోల్‌బంక్ ఎదుట, నవాబుపేట–మొగుళ్లపల్లి గ్రామాల మధ్య గల రోడ్లను జేసీబీ సాయంతో మరమ్మతులను చేపట్టారు. దీంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేసి పోలీసులను అభినందించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జడల్‌పేట కల్వర్టు రోడ్డుకు మరమ్మతు

చిట్యాల: మండలంలోని జడల్‌పేట–భీష్మనగర్ గ్రామాల మధ్య ఉన్న కల్వర్టు గతంలో కురిసిన వర్షాల మూలంగా కొట్టుకపోయింది. దీంతో ప్రయాణికులు, వాహనాదారులు పడుతున్న ఇబ్బందులను చూసి జిల్లా ఎస్పీ కరుణాకర్ ఆదేశాల మేరకు చిట్యాల సీఐ వేణు చందర్, ఎస్సై రమేష్ సూచనల ప్రకారం రెండవ ఎస్సై ఎండీ.శాఖాన్ ఆధ్వర్యంలో ట్రాక్టర్లలో రోడ్డుకు మోరం పోయించి మరమ్మతులు చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది లాల్‌సింగ్, నవీన్, లింగన్న, ప్రశాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.



రేగొండలో గుంతలను పూడ్చి వేస్తున్న పోలీసులు

టేకుమట్ల(రేగొండ): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పరకాల–రేగొండ ప్రధాన రోడ్డు గుంతలమయమై నిత్యం వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కాగా రోడ్డు ప్రమాదాల నివారణకు రేగొండ శ్రీకాంత్‌రెడ్డి ఆదివారం ప్రధాన రోడ్డులో గల గుంతలను సిమెంట్ కాంక్రీట్‌తో పూడ్చివేపించారు. ప్రమాదాల నివారణకు కృషి చేసి గుంతలను పూడ్చివేపించిన ఎస్సై శ్రీకాంత్‌రెడ్డికి పలువురు వాహనదారులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు



దరఖాస్తు సమర్పిస్తున్న వీరగోపాల్

టేకుమట్ల(రేగొండ): అసెంబ్లీ ఎన్నికల్లో భూపాలపల్లి నియోజకవర్గం నుంచి టికెట్ ప్రకటించాలని కోరుతూ.. ఆదివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రేగొండ మండలంలోని గూడెపల్లి గ్రామానికి చెందిన లింగంపెల్లి వీరగోపాల్ దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శిగానే కాకుండా స్వదేశీ జాగరన్ మంచ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా, ఆర్ఎస్ఎస్ పలు బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థి నేతగా ఎన్నో కార్యక్రమాలు చేపట్టి, ప్రస్తుతం సాంఘిక, ధార్మిక కార్యక్రమాలను నిర్వర్తిస్తున్నట్లు తెలిపారు.

జనక్‌ప్రసాద్‌కు టికెట్ ఇవ్వాలి



మాట్లాడుతున్న జోగు బుచ్చయ్య

భూపాలపల్లి అర్బన్: రామగుండం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్ జనక్‌ప్రసాద్‌కు ఇవ్వాలని ఐఎన్టీయూసీ యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జోగు బుచ్చయ్య తెలిపారు. ఏరియాలోని యూనియన్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఐఎన్‌టీయూసీ కార్మికుల సంక్షేమం కోసం 35 ఏళ్లుగా జనక్‌ప్రసాద్ సేవలు చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే టికెట్ కేటాయిస్తే కార్మికవర్గం ఏకమై గెలిపించుకుంటామని భరోసా కల్పించారు. రాజేందర్, రాజయ్య, వేణుగోపాల్, రాంబాబు, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, కృష్ణ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా కాంగ్రెస్



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సీతక్క



నివాళులర్పిస్తున్న సీతక్క

ములుగు రూరల్: కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే సీతక్క అన్నారు. ఈ మేరకు ఆదివారం గోవిందరావుపేట మండలం పస్రాలో కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు పులుగుజ్జు వెంకన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా నష్టపోయిన ప్రజలను ప్రభుత్వం ఆదుకోవడంలో విఫలమయ్యారని అన్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంది చేతనైన సాయం అందిస్తూ అందుబాటులో ఉంటున్నానని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలను మభ్యపెట్టేందుకు లేనిపోని మాటలు చేపుతున్న బీఆర్ఎస్ నాయకుల కుటీల ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. అనంతరం సీపీఎం, బీఆర్ఎస్ పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం రాబోతుందని కార్యకర్తలు కష్టపడి పని చేయాలని అన్నారు. మండల అధ్యక్షుడు వెంకటకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, సీతారాంనాయక్, ఎల్లారెడ్డి, సుధాకర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా..

ఎస్ఎస్‌తాడ్వాయి: బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని కాంగ్రెస్ పార్టీ జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే సీతక్క అన్నారు. మండలంలోని ఊరట్టం గ్రామంలో ఇటీవల మృతి చెందిన చర్పా సమ్మక్క దిశదిన కర్మకు ఆదివారం సీతక్క హాజరై బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సీతక్క వెంట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఇర్సవడ్ల వెంకన్న, మండల గౌరవ అధ్యక్షుడు అనంతరెడ్డి, సీతక్క యువసేన జిల్లా అధ్యక్షుడు చర్పా రవీందర్, సీనియర్ నాయకులు కోటే నర్సయ్య, నేతాజీ పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

చిట్యాల: ఆలయాల అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి కోరారు. ఆదివారం మండలంలోని జూకల్ గ్రామంలోని పోచమ్మ తల్లీ ఆలయంలో పునరుద్ధరణ పనులను ప్రారంభించి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన కీ.శే.రావుల రాఘవరెడ్డి జ్ఞాపకార్థం అతడి కుమారుడు రావుల వెంకట్‌రెడ్డి ఆలయ పునరుద్ధరణ పనుల కోసం రూ. 5 లక్షల నిధులతో పనులను చేయించడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా వారిని సన్మానించారు. అలాగే గతంలో గుడి నిర్మాణం కోసం వివిధ సంఘాల నాయకులు, గ్రామస్తులు విరాళాలు అందించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గొర్రె సాగర్, పీఏసీఎస్ చైర్మన్ క్రాంతి కుమార్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ పుట్టపాక మహేందర్, ఉప సర్పంచ్ చాడ అనందొరెడ్డి, ఎంపీటీసీ జంబుల తిరుపతి, మండల నాయకులు దావు వీరారెడ్డి, జంబుల చంద్రమౌళి, పిట్ట సురేష్, చిలుములు రమణాచారి, రవీందర్, రాజు, శ్రీమన్నారాయణ, కట్కూరి నరేందర్, ఎండి రాజ్‌మహ్మద్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న పుట్ట మధు

కాటారం: మండల కేంద్రంతో పాటు చిద్నెపల్లికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ఆదివారం మంథనిలో పెద్దపల్లి జెడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుట్ట మధు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మండల కేంద్రానికి చెందిన అశోక్, అభినవేణ ఐలయ్య, చిద్నెపల్లికి చెందిన మహేశ్‌చారి, శ్రీకాంత్, చందు, రాజు, శేఖర్, రవి, మహేశ్‌లకు పుట్ట మధు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ పార్టీ, పుట్ట మధు చేపడుతున్న కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు నూతనంగా చేరిన వారు పేర్కొన్నారు. మంథని నియోజకవర్గంలో పుట్ట మధు గెలుపే లక్ష్యంగా పని చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ రాష్ట్ర నాయకుడు జక్కు రాకేశ్, మండల అధ్యక్షుడు తోట జనార్దన్, యూత్ అధ్యక్షుడు రామిళ్ల కిరణ్, జోడు శ్రీనివాస్, చెన్నూరి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అధికార ప్రతినిధిగా బాలాజీ



నియామక పత్రాన్ని ఇస్తున్న పుట్ట మధు

మహాముత్తారం: బీఆర్ఎస్ పార్టీ మండల అధికారి ప్రతినిధిగా మండలంలోని పెగడపల్లి గ్రామానికి చెందిన బోడ బాలాజీని నియమించారు. ఈ మేరకు పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు ఆదివారం బాలజీ నాయక్‌కు నియామక ప్రతాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జక్కు రాకేష్, మండల అధ్యక్షుడు కల్వచర్ల రాజు, కాటారం సబ్ డివిజన్ అధికార ప్రతినిధి బానోతు జహన్‌నాయక్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు దూలం మల్లయ్య, ఎంపీటీసీ శ్రీపతి సురేష్, కాళేశ్వర దేవస్థాన డైరెక్టర్ మండ వెంకటస్వామి, జగపతినాయక్, బాపు, రాజమళ్ల తదితరులు పాల్గొన్నారు.

హిందు, ముస్లిం మత పెద్దలతో సమావేశం



శాంతి సమావేశం నిర్వహిస్తున్న ఎస్సై లక్ష్మణ్‌రావు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో హిందు,ముస్లిం మత పెద్దలతో ఎస్సై లక్ష్మణ్‌రావు ఆదివారం శాంతి సమావేశం నిర్వహించారు. వినాయక చవితి, మిలాద్ ఉన్ నబి పండుగలు వస్తున్న నేపథ్యంలో ఇరు మతపెద్దలతో శాంతి యుతంగా ఎలాంటి ఘర్షణలు లేకుండా పండుగలు నిర్వహించుకోవాలన్నారు. మిలాద్ ఉన్ నబి సందర్భంగా ముస్లింలు ర్యాలీ నిర్వహించడానికి అనుమతిని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జమామసీద్ ప్రెసిడెంట్ అమీన్, ఎగ్బాల్, నిసార్, శఫీక్, హమిద్, మక్సూద్, పవన్‌శర్మ, భాస్కరశర్మలు పాల్గొన్నారు.

పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ



కాటారం: ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



మహదేవపూర్‌లో..

కాటారం: భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన యోధురాలు చాకలి ఐలమ్మ అని పలువురు నాయకులు తెలిపారు. చాకలి ఐలమ్మ వర్ధంతిని రజక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం మండల అధ్యక్షుడు రాజయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట జనార్దన్, శ్రీనివాస్, ఐలయ్య, శంకర్, రమేశ్, రజనీకాంత్, సురేశ్, పవన్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

మహదేవపూర్: మండల కేంద్రంలో అమరవీరుల స్థూపం వద్ద చాకలి ఐలమ్మ వర్ధంతిని ఆదివారం రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పాలు పంపిణీ చేశారు. జిల్లా రజక సంఘం అధ్యక్షుడు చెన్నూరి వెంకటయ్య మాట్లాడుతూ.. జమీందారి వ్యవస్థకు వ్యతిరేకంగా తెలంగాణ రైతంగా సాయుధ పోరాటంలో పాల్గొన్న వీరనారి చాకలి ఐలమ్మ అన్నారు. జనగామ జిల్లాకు చాకలి ఐలమ్మ పేరు పెట్టాలని డిమాండ్ చేశాడు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు చెన్నూరి రాజు, శివ, సంతోష్, దొడిపాట్ల సమ్మయ్య, శ్రీను, శంకర్, మధుకర్, విలసాగరం రాము, కనుకుల మధునయ్య, పుసాల రాజేష్, వేములవాడ సారయ్య, నస్పురిసాయి, సిద్దు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహాముత్తారం: తెలంగాణ రైతాంగ సాయుధపోరాటానికి మత రంగు పులుమడం సరికాదని భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పోలం రాజేందర్ అన్నారు. ఆదివారం మండలంలోని పోలంపల్లిలో చిట్యాల ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మానేటి బాపు, రాజశేఖర్, మధుకర్, సురేష్, నాగేష్, బన్నీ, శిష్ను ఉన్నారు.

చిట్యాలలో..

చిట్యాల: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, చాకలి ఐలమ్మ వర్ధంతిని రజకుల సంఘం మండల అధ్యక్షుడు ముసాపూరి కుమారస్వామి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూమికోసం, భుక్తి కోసం వెట్టి చాకిరీ విముక్తి కోసం పోరాడి, తెలంగాణ ప్రజల తెగువను, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన నిప్పుకణిక చాకలి ఐలమ్మ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఉప్పుల కిరణ్, జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్, ముసాపూరి రమేష్, కార్యవర్గ సభ్యులు ఉప్పుల రవీందర్, గంగాధర శ్రీనివాస్, ముసాపూరి కుమార్, శశి, రవీందర్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

మల్హర్: తెలంగాణ సాయుధ పోరాట వనిత చాకలి ఐలమ్మ వర్ధంతిని మండలంలోని తాడిచర్ల, కొయ్యూరు గ్రామాల్లో రజక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు తాడిచర్లలో ఐలమ్మ విగ్రహానికి, కొయ్యూరులో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల అధ్యక్షుడు ఓదెలు, ఉపాధ్యక్షుడు కనుకల రాకేష్ మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో విప్లవాగ్నిగా నిలిచి నిజాం నవాబు గుండెల్లో వణుకు పుట్టించిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు సుంకరి సత్తయ్య, సిద్ది లింగమూర్తి, జాతీయ సంఘం జిల్లా ఇన్‌చార్జ్ విజయగిరి సమ్మయ్య, రజక సంఘం గౌరవ అధ్యక్షుడు పైడాకుల పోచయ్య, మండల కార్యదర్శి పైడాకుల సమ్మయ్య, మండల సభ్యులు మధు బాబు, రఘువరన్ తదితరులు పాల్గొన్నారు.



మహాముత్తారంలో..



తాడిచర్లలో..



చిట్యాలలో..

సన్మానం



శ్రీధర్‌బాబును సన్మానిస్తున్న రాజయ్య

మల్హర్: ఏఐసీసీ కార్యదర్శి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబను తెలంగాణ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా నియమించిన సందర్భంగా వైస్ ఎంపీపీ బడితెల సరూప రాజయ్య, మంథని సోషల్ మీడియా కోఆర్డినేటర్ నస్పూరి నాగరాజులు ఆదివారం సన్మానించారు. భూపాల్లి జిల్లా జరిగిన ఓ వివాహానికి హాజరైన శ్రీధర్‌బాబును వారు కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు.